విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శనివారం 11 జనవరి 2025 | 8 పేజీలు

తొక్కిసలాట ఘటన దురదృష్టకరం : టీటీడీ చైర్మన్

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : శ్రీవారి భక్తులకు వైకుంఠ ఏకాదశి వైకుంఠ ద్వార దర్శనాన్ని కల్పించడంలో భాగంగా టీటీడీ తిరుపతిలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో జనవరి 8వ తేది రాత్రి బైరాగి పట్టెడలోనూ మరియు విష్ణువాసం కౌంటర్లలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన ఆరుగురు భక్తులు మృతికి టీటీడీ బోర్డు సంతాపం తెలిపింది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం సాయంత్రం అత్యవసర సమావేశాన్ని

2

తిరుమలలో ఘనంగా

వైకుంఠ ద్వార దర్శనం

సామాన్య భక్తులకు అనుకున్న సమయానికే వైకుంఠ ద్వార దర్శనం

- అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : ముక్కోటి ఏకాదశి పర్వదినాన వైకుంఠ ద్వార దర్శనం శుక్రవారం తిరుమలలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ రోజు తెల్లవారుజామున అభిషేకం తర్వాత శ్రీవారి దర్శనం ప్రారంభమైంది.

2

ఆధ్యాత్మిక నగరంలో అలజడి

- గోవిందుని చెంత.. ఆహాకారాలు.. ఆర్ధనాధాలు
- తొక్కిసలాటతో తిరుపతిలో గంధరగోళం
- మూడు రోజులుగా నగరానికి నేతల తాకిడి
- బాధితులకు పరామర్శలు, పరిహారం, శ్రీవారి ప్రత్యేక దర్శనం
- అధికారుల నిర్యక్ష్యం
- నేతలకు అవకాశం
- దుర్ఘటనకు అధికారులే కారణమైనా... రాజుకుంటున్న రాజకీయ వేడి ... సాగుతున్న ధర్యాప్తు
- క్షతగాత్రులను ప్రత్యేక ఏర్పాట్లతో స్వస్థలాలకు పంపిన అధికారులు



తిరుపతి నగరం గోవింద నామాలతో.. ఏడుకొండల వాని నామాలను తపిస్తూ భక్తుల తాకిడితో రద్దీగా ఉండేది. ఏడాధికోసారి అత్యంత వైభవంగా జరిగే వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తులు దేశ నలుమూలల నుంచి వస్తుంటారు. ప్రత్యేకించి కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి అధికంగా తాకిడి ఉంటుంది. ఆ మేరకు అధికారులు వైకుంఠ దర్శన ఏర్పాట్లుకు సంబంధించి నెల రోజుల నుంచే ఏర్పాట్లు ప్రణాళిక సిద్ధం చేస్తారు. ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు, భక్తులకు వసతి, సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటారు. అందులో భాగంగా ప్రత్యేక దర్శన ఏర్పాట్లలో భాగంగా ముందస్తుగా రద్దీ దృష్ట్యా తిరుపతిలోనే వైకుంఠ ద్వార దర్శన టోకెన్లను ఇచ్చేలా గత అనుభవాలకనుగుణంగా ప్రణాళిక రూపొందించారు.

- వార్త మెయిన్‌లో

తిరుపతి ఘటనలో...

క్షతగాత్రులకు వైకుంఠ ద్వార ప్రత్యేక దర్శనం

విశాలాంధ్ర - తిరుపతి కార్పొరేషన్ : తొక్కిసలాటలో గాయపడి చికిత్స పొందిన శ్రీవారి భక్తులకు సీఎం ఆదేశాలతో అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కల్పించారు. సామాన్య భక్తులకే ప్రాధాన్యత ఇస్తున్నామని ఈ సందర్భంగా శుక్రవారం టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సామాన్య భక్తులకు సర్వ దర్శనం ప్రారంభించామన్నారు. శుక్రవారం దర్శన స్లాట్‌ను బుక్ చేసుకున్న భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పిస్తామని హామీ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామల రావు, పలువురు బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. స్వస్థలాలకు.. క్షతగాత్రులు తిరుపతి తొక్కిసలాట ఘటన లో క్షతగాత్రులను ప్రత్యేకంగా శ్రీవారి దర్శనం చేయించి స్వస్థలాలకు పంపించాలని అధికా రులకు సీఎం ఆదేశించారు. ఆ మేరకు శుక్రవారం క్షతగాత్రులకు ప్రత్యేక

2

నాణ్యమైన విత్తన నారు దొరుకునా..!

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న నర్సరీలు
- సీజన్ కు సిద్ధమవుతున్న కర్షకులు
- నాణ్యమైన నారే ముఖ్య వనరు
- ముందస్తు ప్రణాళిక లేని ఉద్యాన శాఖ
- టమోటా సాగుకు రైతులు సన్నద్ధం
- నర్సరీల పర్యవేక్షణ ఊసెత్తని ఉద్యాన శాఖ
- రైతుల అవసరం కనబడలేదు.... ముందస్తు ప్రణాళిక వేయలేదు
- నాసిరకంబారిన పడే ప్రమాదం కనబడుతోంది
- నిద్రావస్థలో ఉద్యాన శాఖ జోగుతోంది

2

తొక్కిసలాట ఘటన దురదృష్టకరం

(మొదటి పేజీ తరువాయి) టిటిడి బోర్డు నిర్వహించింది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం సాయంత్రం అత్యవసర సమావేశాన్ని టిటిడి బోర్డు నిర్వహించింది.అనంతరం జరిగిన మీడియా సమావేశంలో టీటీడీ ఛైర్మన్ బి ఆర్ నాయుడు మాట్లాడుతూ బుధవారం రాత్రి జరిగిన సంఘటన అందరినీ కలచి వేసింది అన్నారు. ఈ దురదృష్ట సంఘటనలో మృతి చెందిన వారి పవిత్ర ఆత్మలకు శాంతి కలగాలని ఆ దేవదేవుని మనస్ఫూర్తిగా మేమందరం ప్రార్థిస్తున్నాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మరణించిన వారి కుటుంబాలకు 25 లక్షలు, తీవ్రంగా గాయపడిన వాళ్లకి 05 లక్షలు, చికిత్స పొందుతున్న వారికి 02 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ఇచ్చేందుకు నిర్ణయించాం.అదేవిధంగా మృతుల పిల్లలకు ఉచిత విద్యను కూడా టిటిడి విద్యాసంస్థల్లో ఇవ్వడానికి మా బోర్డు నిర్ణయించింది.టిటిడి బోర్డు సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మరియు సుచిత్ర ఎల్లా చెరో 10 లక్షలు, ఎమ్మెస్ రాజు 3 లక్షల రూపాయలు మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందిస్తున్నారు,అనిటీటీడీ ఛైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఈవో శ్యామల రావు,అదనపుఈవోసిహెచ్వెంకయ్య చౌదరి, ఇతర బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వైకుంఠ ద్వార దర్శనం

(మొదటి పేజీ తరువాయి) అరగంట ముందుగానే భక్తులకు సంతృప్తికరంగా దర్శనం ప్రారంభించారు. గోవిందా.. గోవిందా అనే దివ్య నామాలతో తిరుమల మొత్తం మారుమోగిపోయింది. వైభవంగా శ్రీవారి స్వర్ణ రథం ఊరేగింపు వైకుంఠ ఏకాదశి పర్వదినాన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి స్వర్ణ రథంపై కొలువై స్వర్ణ రథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు, మహిళా ఉద్యోగులు గోవిందా...గోవిందా... నామస్మరణతో స్వర్ణ రథాన్ని నాలుగు మాడ వీధుల్లో ఆధ్యాత్మిక పారవశ్యంతో లాగారు. తొక్కిసలాటలో గాయపడ్డ వారికి శ్రీవారి ప్రత్యేక దర్శనం ఏపీ సీఎం ఎన్.చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం తిరుపతి తొక్కిసలాట ఘటనలో గాయపడిన వారికి టీటీడీ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వైకుంఠ ద్వార దర్శనం అనంతరం భక్తులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ తమకు ముక్కోటి దర్శనం కల్పించినందుకు సీఎం చంద్రబాబు, టీటీడీ ఛైర్మన్ బీ ఆర్ నాయుడు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యత-అదనపు ఈవో సీఎం చంద్ర బాబు నాయుడు ఆదేశాల మేరకు సామాన్య భక్తులకే ప్రాధాన్యత ఇస్తున్నామని తిరుమల అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సామాన్య భక్తులకు సర్వ దర్శనం ప్రారంభించామన్నారు. ఈరోజు దర్శన స్లాట్‌ను బుక్ చేసుకున్న భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పిస్తామని హామీ ఇస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామల రావు, పలువురు బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి ఘటనలో...

(మొదటి పేజీ తరువాయి) దర్శనానంతరం తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి నగరపాలక కమిషనర్ మౌర్య పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి బస్సులో సొంత ప్రాంతాలకు పంపించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్విమ్స్ ఆస్పత్రి నుంచి 32మంది డిశ్చార్జ్ అయ్యారని, ప్రస్తుతం ఐదు మంది ఇంకా చికిత్స పొందుతున్నారని, వారి ఆరోగ్యం మెరుగ్గా ఉందని సాయంత్రం వారిని వైద్యులు డిశ్చార్జ్ చేయనున్నారని తెలిపారు. క్షతగాత్రు లను స్వయంగా పలకరించి గాయపడిన వారందరికీ వైకుంఠ ఏకాదశి దర్శనం ఏర్పాటు చేయించి, ప్రత్యేక వాహనాల్లో వారిని వారి స్వంత ప్రాంతాలకు వెళ్లేలా ఏర్పాట్లు చేయించినట్లు తెలిపారు. అలాగే అన్ని సౌకార్యాలు వైద్య, వాహన, భోజన ఏర్పాట్లను చేసి తమను తమ స్వగ్రామాలకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి పంపిస్తున్నట్లు వివరించారు. విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కడప, తిరుపూర్, కోయంబత్తూర్లకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అంగన్వాడీలకు...

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- ఏఐటీయూసీ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య

విశాలాంధ్ర - చిత్తూరు: అంగన్వాడీ లకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు జీతాలు చెల్లించాలని, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కోదండయ్య ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ డిమాండ్ చేశారు. చిత్తూరు కలెక్టర్ ఆఫీస్ దగ్గర జాతీయ సమితి పిలుపులో భాగంగా ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ అనుబంధం చిత్తూరు జిల్లా సమితి జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి ఆధ్వర్యంలో అంగన్వాడి సమస్యల పైన జిల్లా జాయింట్ కలెక్టర్ కువినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి కేంద్ర ప్రభుత్వం ఇప్పటిదాకా వేతనాలు పెంచలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఐదు సంవత్సరాల నుండి గౌరవ వేతనాలు పెంచలేదు. పని భారం పెంచుతూ, నిత్యం నిరంతరం, నిత్యవసర సరుకులు ధరలు డీజిల్ గ్యాస్ పెట్రోల్ ధరలు పెంచుతున్న వేతనాలు పెరగలేదన్నారు.అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు మినీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి. జ మినీ టీచర్లందరినీ మెయిన్ టీచర్ గా గుర్తించాలి విధులలో చనిపోయిన వారికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలి, 20 వేలు రూపాయలు మట్టి ఖర్చులకు ఇవ్వాలని ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలనిడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి ఏఐటీయూసీ చిత్తూరు నగర కార్యదర్శి దాసరి చంద్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమాదేవి ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటియుసి అనుబంధం చిత్తూరు జిల్లా నాయకులు అరుణ రమాదేవి సుజాత జ్యోతి శాంతి రాధా తదితరులు పాల్గొన్నారు.

విత్తన నారు దొరుకునా..!

విశాలాంధ్ర - పలమనేరు : చిత్తూరు జిల్లా పలమనేరు ఉద్యాన డివిజన్లో అత్యధికంగా టమోటా సాగు చేపడతారు.ఈ పరిధిలో పలమనేరు బైరెడ్డిపల్లి వి.కోట మండలాలు వస్తాయి.సుమారు 7 వేల హెక్టార్లకు పైగా పంట సాగు చేస్తారు.జనవరి నుండి వివిధ దశల వారీగా జూన్ వరకు టమోటా సాగుపై రైతులు దృష్టి పెడతారు.జనవరిలో మొదటి విడత విత్తెందుకు ఆసక్తి చూపుతారు.పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.పశువుల ఎరువులు చేనుపై చెల్లుతున్నారు.దుక్కులు చేస్తున్నారు.ఏ రకం నారు? నాటితే అధిక దిగుబడి వస్తుందని ఆరా తీస్తున్నారు.విత్తన నర్సరీల వద్ద నారు రకాలను అడిగి తెలుసుకుంటున్నారు.ఏ రకం నారు నాటితే మంచి దిగుబడి వస్తుందని వాకబు చేస్తున్నారు.ఇదే అదునుగా జనవరి నుండి విత్తన నర్సరీలు టమోటా నారు పెంపకంపై దృష్టి పెడుతున్నారు.రకరకాల విత్తన నారులు రైతులకు అమ్మేందుకు ప్రణాళికలు వేసుకుంటున్నారు.నాణ్యమైన నారు రైతుకు దొరకడం కష్టతరంగా మారుతుంది.నాసిరకం నారతో రైతులు నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది.కల్తీ నార్లతో కర్షకులు కష్టాలు పడే అవకాశాలు దాపురిస్తాయి.రైతుల ఆసక్తి దృష్ట్యా ఉద్యాన శాఖకు రైతులకు కావాల్సిన నాణ్యమైన టమోటా నారు అందించాల్సిన బాధ్యత ఉంది.అయితే ఎటువంటి ముందస్తు ప్రణాళిక లేదు.రైతులకు అండగా నిలవాలన్న సంకల్పం కనబడటం లేదు.నాణ్యమైన నారు అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యతను ఉద్యాన శాఖ అధికారి విస్మరిస్తున్నారు .దీంతో నాసిరకం నార్ల బారిన టమోటా రైతులు పడాల్సిన దుస్థితి దాపురిస్తోంది.విత్తననారు విక్రయాలకు నర్సరీలు పుట్టగొడుగుల వెలుస్తున్నాయి.మూడు మండలాల్లో సుమారు 80 నర్సరీలకు పైగా వున్నాయి.ఆ నర్సరీలు అనుమతులు తీసుకు న్నారా..?. .విత్తనాలు ఎక్కడి నుంచి సేకరిస్తున్నారు.?? ఈ వాతావ రణానికి అణువైనవేనా?? నారు పెంపకంలో తీసుకుంటున్న జాగ్రత్తలు ఏంటి? ఏ రకం విత్తనం ?ఏ కంపెనీ కి చెందినది ?ఈ వాతావరణానికి అనువైనదా ?కాదా ? దిగుబడి ఎలా ఉంటుంది? ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటారు? తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలు ఏంటి ?తదితరాలు పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉద్యాన శాఖ అధికారిది.అవేమి అధికారి పట్టించుకోవడం లేదు.నర్సరీల బాట పట్టింది లేదు.తనిఖీలు చేపట్టింది లేదు.జాగ్రత్తలు చెప్పింది అసలు కనబడలేదు.ఉద్యాన శాఖ అధికారి ఉన్నారన్న జాడే కనబడడం లేదు.రైతులకు అవగాహన కల్పించాల్సిన అధికారి పట్టించుకోలేదు.దీంతో రైతులు నాసిరకం విత్త నారు బారిన పడాల్సి ప్రమాదం సమీపిస్తుంది.మొక్క దశలో నారు కలకలా మెరుస్తున్న నాటి 90 రోజులు సంరక్షిస్తే గాని నాణ్యమైనదా? నాసిరకమైనదా? అన్న విషయం బయటపడదు. ఎకరా టమోటా సాగుకు సుమారు1.50 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది.మిరప, స్వీట్ కార్న్, క్యాబేజ్,వంగ, తదితర సాగు జనవరి నుండి విస్తరిస్తోంది. వేసవి కాలంలో ఉగాది జాత ర్లు తదితర వాటిలో మెరుపు అధికంగా వినియో గిస్తారు దీంతో రైతులు మెరుపు సాగుపై దృష్టి పెడుతున్నారు నాణ్యమైన నారు దొరకడం లేదు నాసిరకం నార అంటగట్టి నర్సరీ యజమానులు చేతులు దులుపుకుంటున్నారు..గత సంవత్సరం ఇదే సీజన్లో వి.కోట మండలంలోని పాపేపల్లి మిట్ట వద్ద వున్న నర్సరీలో ఓ రైతు ధూమ్ రకానికి చెందిన మిరపనారు కావాలని సంప్రదించారు.నర్సరీ యజమాని ధూమ్ రకానికి చెందిన మిరప విత్తన నారని మభ్యపెట్టారు.రైతుకు 3 వేలు నారు విక్రయించాడు.రైతు నారు నాటాడు.పంట ఏపుగా పెరిగింది.అయితే రైతు కోరిన నారు కాదు.సరైన దిగుబడి రాకపోవడంతో నర్సరీ యజమానిని రైతు నిలదీశాడు.సరైన సమాధానం లేదు.వి.కోట ఉద్యాన శాఖ అధికారి సైతం నారు నేనేమైనా కొనుగోలు చేయమన్నానా... అంటూ నిర్లక్ష్య సమాధానం చెప్పడం గమనార్హం.ఇలా అధికారి నిర్లక్ష్యం వేసవి రైతులకు శాపంగా మారుతుంది.సరైన దిగుబడి రాకుంటే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిందే.రైతుల సాగు విస్తీర్ణా నికి అనుగుణంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవా ల్సిన ఉద్యాన శాఖ అధికారి పత్తా లేదు.ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి టమోటా రైతులకు నాణ్యమైన నారు అందుబాటులో చూసే విధంగాఉద్యానశాఖ అధికారిని ఆదేశించాలని రైతులు కోరుతున్నారు.

కోడి పందాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

- జిల్లా కలెక్టర్ హెచ్చరిక

విశాలాంధ్ర -చిత్తూరు : కోడి పందెములు నిర్వహించుట అందులో పాల్గొనుట చట్టరీత్యా నేరమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని కలెక్టర్ ఛాంబర్ నందు పశు సంవర్ధక శాఖ వారిచే కోడిపందాలు నిర్వహించుట, పాల్గొనుట చట్టరీత్యా నేరమనే పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కోడిపందాలు నిర్వహణ, పాల్గొనుట చట్టరీత్యా నేరమని, ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై సెక్షన్ 10 - ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ 1974 సెక్షన్ 34 - జంతు హింస నివారణ చట్టం, 1960 ల ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోబడునని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ పోస్టల్ ఆవిష్కరణలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ప్రభాకర్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో వైభవంగా వైకుంఠ ఏకాదశి

విశాలాంధ్ర-కార్వేటినగరం:

టీటీడీ అనుబంధంగా ఉంటున్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు వేద మంత్రాలతో ఆలయంలోని మూల విరాట క్కు అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారిని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే ఉత్సవ మూర్తులను కూడా ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం అందులో బాటులో ఉంచారు. ఈ క్రమంలో భాగం గా ఆలయాన్ని వివిధ రకాలైన పుష్పాలు, పళ్లతో సుంద రంగా అలంకరించారు. విద్యుత్ దీపాలతో కూడా ఆలయ గోపురాన్ని సుందరంగా అలందించడం జరిగింది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సురేష్కుమార్. షరాబ్ బాబుసురేష్, పలువురు టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు. -వేణుగోపాల స్వామిని దర్శించుకున్న టీటీడీ బోర్డు సభ్యులు వైకుంఠ ఏకాదశి సందర్భంగా టీటీడీ బోర్డు సభ్యులు రంగశ్రీ దంపతులు వైకుంట ద్వారం ద్వారా వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. వేద పండితులు వేద మంత్రాల నడున ఆశీర్వచనలు అందించారు. ఆనంతరం తీర్థ ప్రసాదాలను అందించారు. -భక్తులకు అన్నదానం వేణుగోపాల స్వామి ఆలయంలో నిర్వహించే అన్నదానం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాధవరాజు కుటుంబ సభ్యులైన, భాగ్యవతి, కార్తీక్, వనితలు ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తులకు అన్నదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ఇంటి పట్టాల కోసం ఫిబ్రవరి నుండి మహోద్యమం

ఎన్నికల హామీ మేరకు 3 సెంట్లు స్థలం రూ.5 లక్షల ఇంటి నిర్మాణానికి ఇవ్వాల్సిందే

స్థలాల కోసం భూ పోరాటానికైనా సిద్ధం : సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ టి. జనార్ధన్

విశాలాంధ్ర – పుంగనూరు : పట్టణ ప్రాంతాల్లో పేదలకు మూడు సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సహాయం అంది వ్వకుంటే రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి నుండి మహో ద్యమం నిర్వహించ నున్నట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ టి .జనార్ధన్ హెచ్చరించారు. సిపిఐ రాష్ట్రవ్యాప్త ఇంటి పట్టాల ఆందోళన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పుంగనూరు తహ శీల్దార్ కార్యాలయం వద్ద పట్టణ పేదలచే ధర్నా కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు పేదలకు పక్కా ఇండ్ల నిర్మాణం చేస్తామని, ఉపాధి కల్పనకు పలు కార్యక్రమాలు చేపడతామని ఇచ్చిన హామీలు నేటికి ఉపక్రమిం చడం లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో చాలిచాలని విధంగా ఒక సెంటు స్థలంలో ఇల్లు నిర్మాణాన్ని చేపట్టడం వలన ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఫలితంగానే నేడు కూటమి ప్రభుత్వం అధి కారం రావడానికి దోహద పడిందని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఎన్నో పథకాలు వాగ్దానాలు చేసినా వాటి అమలకు ఇప్పటివరకు పూనుకో కపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించ కుంటే సిపిఐ ఆధ్వర్యంలో తగువిధంగా బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చ రించారు. పుంగనూరు పట్టణంలో 10 కాలనీలలో 3000 మందికి పైగా పేదలు ఇంటి స్థలాల కోసం లేక బాడుగ ఇండ్లలో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పలు కాలనీలలో ఇంటింటి సర్వే చేసి 500 మంది లబ్ధిదారులను సిద్ధం చేశామని తెలిపారు. లబ్ధిదా రులతో ఫిబ్రవరి నెలలో తాహశీల్దార్ కార్యాలయం వద్ద వంటావార్పు కార్యక్రమం చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం దిగి రాకుంటే నేరుగా ప్రభుత్వ స్థలాల్లో జెండాలు పాతి భూ పోరాటానికి సైతం సిద్ధపడతా మని హెచ్చరించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి కె.రామ్మూర్తి మాట్లా డుతూ భగత్ సింగ్ కాలనీ, నక్కబండ బీడి వర్కర్స్ కాలనీలలో పేదలు ఇంటి పట్టాల కోసం పలుమార్లు అర్జీలు పెట్టుకు న్నా అధికా రుల్లో చలనం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు రత్నమ్మ ,పరమేశ్వర్ ,కిషోర్ ,రాజమ్మ ,కవిత, శాంతమ్మ జరీనాబి తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనం తరం ఇంటి పట్టాల దరఖా స్తులను రెవెన్యూ కార్యాలయ డిటి నాగేశ్వర్‌కు అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ

– మరోసారి దాతృత్వం చాటిన డాక్టర్ కోటేశ్వరబాబు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: నూటికో 'కోటి'కో ఒక్కరు.. ఎప్పుడో ఎక్కడో పుడ తారు అనే ఓ సినిమా లోని గీతానికి సరితూగి పోతారాయన. ఏదోక సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తూ నిస్వార్థ సేవకు నిదర్శనంగా నిలుస్తున్న సంఘ సేవకులు, ఆంధ్ర శ్రీ అవార్డు పురస్కార గ్రహీత డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు మళ్లీ తన దాతృత్వాన్ని చాటారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘంలో విధులు నిర్వహించే పారిశుధ్య మహిళ కార్మికులు 70 మందికి నాణ్యమైన చీరలను పంపిణీ చేశారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజు ముక్కోటి దేవతలు మహావిష్ణువుని దర్శించుకునే పవిత్రమైన రోజు 'కోటి'పుణ్యాలకు నెలవైన ముక్కోటి ఏకాదశి అని తెలిపారు. ఈ పర్వదినంనాడు పారిశుధ్య మహిళా కార్మికులకు చీరలను పంపిణీ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. కరోనా మహమ్మారి విలయతాండవం చేసిన రోజు అందరం మన మన ఇళ్లకే పరిమితమయ్యామని గుర్తు చేశారు. కానీ పారిశుద్ధ్య విభాగంలో పనిచేసే ఈ వీర మహిళలు ఆ క్లిష్ట పరిస్థితుల్లో ఎక్కడా అపరిశుభ్రత లేకుండా నిత్యం పని చేశారని తెలిపారు. వీరి పనితీరుతో ఆ కరోనాకే వణుకు పుట్టిందన్నారు. అటువంటి మహిళా తల్లలుకు సేవ చేసుకునే భాగ్య ం తనకు ఈ రకంగా కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం సాని టరీ ఇన్స్పెక్టర్లు బాలకృష్ణ, తిరుమలరావు, మేస్త్రీలు ఉదయ్, అనిల్, శ్రీకాంత్, 18 వ వార్డుసచివాలయసిబ్బంది,పసుపులేటి పురుషోత్తం, మస్తాన్ ,తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ నేతలకు ముక్కంటి ప్రసాదాలు

విశాలాంధ్ర– శ్రీకాళహస్తి: వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించు కుని తిరుమల శ్రీవారు... శ్రీకాళహస్తిలో శ్రీకాళహస్తీశ్వ రస్వామి దర్శనం కోసం విచ్చేసిన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకరు గడ్డం ప్రసాద్ కుమార్, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు రేణిగుంట విమా నాశ్రయంలో వేర్వేరుగా స్థానిక కాంగ్రెస్ నేతలు ముక్కంటి ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా స్వామి వారి శేష వస్త్రంతో సన్మానించారు. అంతకు మునుపు వీరికి పుష్ప గుచ్చాలు అందచేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగురువంబాబు, శ్రీకాళహస్తి నియోజక వర్గ సమన్వ యకర్త తలపా దామోదరం రెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వ యకర్త దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి, తిరుపతి నగర కాంగ్రెస్ అధ్య క్షులు గౌడ పేరు చిట్టిబాబు, శివ శంకర్, కలింద్ర, రత్నం, కరీముల్లా, ఆంటోనీ, నవీన్, చందు, దేవా, రూపే తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి

విశాలాంధ్ర–శ్రీకాళహస్తి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం శ్రీకాళహస్తి ప్రాంతంలో పలుచోట్ల విశేషాలు జరిగాయి. శ్రీకాళహస్తీ శ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఉదయం గొబ్బెమ్మ ఊరేగింపు జరిగింది. ఆ తర్వాత స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను శేష, యాళి వాహనాలపై ఊరేగించారు. ఆలయంలోని అభయ వెంకటే శ్వర స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయానికి అనుబంధంగా పట్టణంలో ఉన్న వరదరాజ స్వామి ఆలయంలో కూడా విశేష కార్యక్రమాలు జరిగాయి. స్వామి అమ్మవార్ల ఉత్సవం మూర్తులను భక్తులు దర్శించుకున్నారు. శ్రీకాళ హస్తి మండలం ఊరందూరు గ్రామంలోని అన్నపూర్ణ దేవి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో, శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో, తొండమాన్ పురం లోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా ప్రత్యేక కార్యక్రమాలు జరి గాయి. తిరుమలకు వెళ్లలేని భక్తులు తొండమాన్ పురం ఆలయానికి వెళ్లి స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా వీక్షా ది స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర – తిరుపతి : సంక్రాంతి సంబరాల ను వీక్షా ది స్కూల్ నందు శు క్రవారం ముందస్తుగా ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బైరాగి పెట్టడ నందు గల వీక్ష స్కూల్ విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి మన హిందువులకు మొదటి పండగ అయినా సంక్రాంతి గురి ంచి ముగ్గుల పోటీలలో, పతంగుల ఎగురవేయడంలోనూ, మట్టి కుండలతో పిల్లలు మన సంస్కృతి సంప్రదాయాలను ఉట్టిపడే విధంగా తల్లిదండ్రులకు తోటి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. పూర్వం నుంచి కూడా మన భారతదేశం జనవరి మాసంలో వచ్చే మొదటి పం డుగ సంక్రాంతి. కోడిపందాలతోనూ, కొత్త కోడళ్లు, కొత్త అల్లుళ్లతోనూ ప్రతి ఇంటిలో రంగవల్లులు దిద్ది సంబరాలతో రైతులు పండించిన పంటలను తమ ఇళ్లకు చేర్చుకొని సంబరాలతో జరుపుకునే పండుగ అని పిల్లలకు వివరించినట్లు పాఠశాల చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృ ష్ణారెడ్డి తెలిపారు. వీక్ష స్కూల్ డైరెక్టర్ విమల మాట్లాడుతూ పిల్లలు చదువుల పట్ల తల్లిదండ్రులను సంతోషాలతో నింపాలని కొత్త సంవ త్సరం మొదటి పండుగ సందర్భంగా ప్రతి పిల్లలు తమ విలేజ్ ఊర్లలో మన పెద్దలను గౌరవించి, మన పెద్దల యొక్క సంప్రదా యాల ను తెలియజేసి వాళ్ళ ఆచరించే విధంగా నడుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'విశ్వభారతి'లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర– శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం గోపాలవనంలో విశ్వభా రతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల కరస్పాం డెంట్ శోభ, ప్రధానోపాధ్యాయులు దేరంగుల శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ సంక్రాంతి సంబరాలు చేశారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలిచిన సంక్రాంతి అందరి జీవితాల్లో నూతన ఉత్సాహం, విజయాలను అందించాలని వారు ఈ సందర్భంగా కోరుకున్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభిలషించారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. పిల్లల కు భోగి పండ్లు పోసి ఆశీర్వచ నాలను అందిం చారు. అనంతరం ఉపా ధ్యాయ బృందం విద్యార్థులకు సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. కాగా విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో విచ్చేసి సంక్రాంతి సంబరాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

విశాలాంధ్ర – వాకాడు: మండలం బాలిరెడ్డిపాళెంలోని శ్రీ పట్టాభిరామాలయంలో పరమ పవిత్రమైన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు.తొలత స్వామి వారికి సుప్రభాత సేవ,ప్రభాత కాలార్చన,విశేష అర్చన లు,సహస్రనామార్చనలు జరిపారు.తదుపరి స్వామి వారి ఉత్సవమూర్తులను వైకుంఠ ద్వార దర్శనంలో దర్శనం ఏర్పాటు చేశారు.పూజా కార్యక్రమాలకు ఉభయకర్తలుగా బుర్లా మహేష్ రెడ్డి,భానుప్రియ దంపతులు వ్యవహరించారు.ఆలయ ప్రధాన అర్చక స్వామి దీవి అనంతాచార్యులు విచ్చేసిన భక్తులకు తీర్థ,ప్రసాదము లు అందజేశారు .పూజాకార్యక్రమాలలోఆలయధర్మకర్తలుమాజీసొసైటీచైర్మన్‌కొడవలూరు దామోద రరె డ్డి,మనోహరరెడ్డి,శార్వానమ్మ, శ్రీనివాసులురెడ్డి,సునీత, వజ్రమ్మ, విజయలక్ష్మి, కిరణ్, కస్తూరి,శ్రీరామసేన సభ్యులు వంశీ,గురుప్రసాద్,సాయి తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్లను ప్రారంభించిన టిడిపి,జనసేన నాయకులు

విశాలాంధ్ర - పుంగనూరు: మండలంలోని మోదుగులపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న పూజగనపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్ర మంలో భాగంగా పాడి రైతుల కొరకు ఉపాధి హామీ ద్వారా రెండు లక్షల 30 వేల రూపాయల తో నిర్మించిన గోకులం షెడ్లను శుక్రవారం రోజున టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మాధవరెడ్డి జనసేన మండల పార్టీ అధ్యక్షులు విరుపాక్షి టీడీపీ సీనియర్ నాయకులు సివి రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి విరుపాక్షి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులను అభివృద్ధి చేయడంలో భాగంగా గోకులం షెడ్ల నిర్మాణానికి అవకాశం కల్పించడం జరిగింద న్నారు. దీనివలన అనేక మంది పాడి రైతులు పాడి ఆవులను ఏర్పాటు చేసుకొని సంతోషంగా జీవించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన నాయకులు భీమ్ గాని పల్లి రమణ గంగాధర్ సుబ్రహ్మణ్యం పగడాల రమణ చిన్నా రాయల్ చైతన్య రాయల్ బాలాజీ నాయక్ హరి నాయక్ బొట్టు శ్రీనివాసులు హరి మహేంద్ర రాంబాబు రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బొజ్జల

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమల వెంకటేశ్వర స్వామిని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఉత్తర ద్వార దర్శనం చేసుకుని శ్రీవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి పర్వదినం నాడు ఆ కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామివారి దర్శనం చేసుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు చెప్పారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా ప్రధాన కార్యదర్శిగా చెరుకుల సుగుణవతి యాదవ్

విశాలాంధ్ర-తిరుపతి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మరియు ఎంపీ రాజ్యసభ ఆర్ కృష్ణయ్య తిరుపతికి చెందిన చెరుకుల సుగుణవతి యాదవ్‌ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా ప్రధాన కార్యదర్శిగా ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంలో సుగుణవతి యాదవ్ మాట్లాడుతూ నాపై నమ్మకం తో నాకు ఇచ్చిన బాధ్యతలను తప్పకుండా బీసీల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల కోసం హక్కుల కోసం పోరాటం చేస్తానని బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్యకి ఇతర బీసీ సంక్షేమ సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలపడం జరిగింది.

వైకుంఠ ఏకాదశి సందర్భంగా అన్నపూర్ణాదేవి ఆలయంలో అన్నదానం

విశాలాంధ్ర-పెద్దపంజాణి: మండలంలోని బసవరాజు కండ్రిగ సమీపంలో వెలసిన శ్రీ అన్నపూర్ణాదేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చలమంగళం గ్రామానికి చెంది కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో స్థిరపడిన వెంకటేష్ దంపతులు దాదాపు 100 సంవత్సరాల క్రితం నాటి శ్రీ అన్నపూర్ణాదేవి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో, ఇటీవల ఆలయ పరిసరాల్లో మొక్కలు, ముళ్లపొదలు తొలగించే చర్యలు చేపట్టారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉదయం ఆలయంలో పూజలు నిర్వహించి, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ బాబు, స్థానికులు భాస్కర్, శ్రీరాములు, మొగిలీశ్వర్ రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకించండి

- ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు పరచాలి

- ఏఐటీయూసీ నేతల డిమాండ్

విశాలాంధ్ర-చిత్తూరు: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు స్వస్థ పలికి, కూటమి ప్రభుత్వం ఎన్నికలు వచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కోదండయ్య, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు యస్.నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారంచిత్తూరు నియోజకవర్గ ఏఐటీయూసీ సమితి సమావేశం వర్కింగ్ ప్రెసిడెంట్ కే.రమాదేవి అధ్యక్షతన స్థానిక ఎస్టియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కోదండయ్య, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు యస్ నాగరాజు మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి కూటమి ప్రభుత్వం మూడవసారి అధికారంలో కి వచ్చిన తర్వాత, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా, కొత్త ఉద్యోగాలు కల్పించకుండా, కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగస్తులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల కొమ్ముకాస్తూ ,కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాలని, నాలుగు కోడ్లు గా తీసుకొచ్చి కార్మికుల్లో కూడా భయోందోళనలకు గురిచేస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న స్కీము కార్మికులు ఏడో తారీఖున జాతీయస్థాయిలో నిరసన కార్యక్రమాలు తెలియపరచినప్పటికీ, కనీసం కేంద్ర ప్రభుత్వం స్పందించకుండా మహిళా కార్మికుల యొక్క వేతనాలకు, ఉద్యోగ భద్రతలకు సంబంధించి ఎలాంటి ప్రకటన చేయకపోవడం దుర్మార్గమైన చర్య. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటియుసి డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ,రాష్ట్రంలో ఉన్న కార్మికులకు జీతాలు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయకుండా, ఉద్యోగ, కార్మిక వర్గం పోరాటం చేస్తుంటే, మన రాష్ట్రానికి విచ్చేసిన ప్రధానమంత్రి, కనీసం విశాఖ ఉక్కు పరిశ్రమ పైన స్పందించకపోవడం ఆంధ్ర ప్రజలను మోసం చేయడమే, పక్కనే ఉన్న మన రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణకు సంబంధించి ప్రధానమంత్రి దృష్టికి తీసుకుపోకపోవడం బాధాకరమన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మన రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి వుంది.ఈరోజు రాష్ట్రంలో ఉన్న ఆటో, హమాలీ కార్మికులకు, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, దేశంలో ఏర్పడిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సంక్షేమ బోర్డు నిధులను దుర్వినియోగం కాకుండా, కార్మికులకే వర్తించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నగర కార్యదర్శి దాసరి చంద్ర, అనుబంధ సంఘాల నాయకులు మణి,విజయ్ కుమార్, క్రిష్ణ, వెంకటేష్, శంకర్ దామోదరం, వినాయక, మునుస్వామి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ విజయ్ కుమార్, బిల్డింగ్ మునుస్వామి, డేవిడ్, ఆటో మోహన్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్, అవుట్సోర్సింగ్ యూనియన్ ,ఆర్టిసి యూనియన్ మణి,రజిని కుమార్, లక్ష్మయ్య, హమాలి యూనియన్ ప్రేమ్ రాజ్, కమల్, రమేష్, మురుగేష్ తదితర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షుడు విస్తృత పర్యటన

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని గోకులం షెడ్లను (ఆవుల షెడ్లు) ప్రారంభించిన గువ్వల రమేష్ రెడ్డి (చిట్టి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పాడి రైతుల కొరకు ఉపాధి హామీ పథకం ద్వారా గోకులం షెడ్లను (ఆవుల షెడ్లు) నిర్మించుకున్న పాడి రైతులకు రూ. 2,30,000 నిధులను కేటాయించారు. చౌడేపల్లి మండలం, చారాల గ్రామపంచాయతీలో నందు నూతనంగా నిర్మించిన గోకులం షెడ్లను ప్రారంభించిన మండల అధ్యక్షులు శ్రీ గువ్వల రమేష్ రెడ్డి (చిట్టి) నాయకులు ప్రదీప్ రాజు ఈ సందర్భంగా చారల గ్రామ నాయకులు మంగళ వాద్యాలతో, భాణా సంచా పెల్చి పూల వర్షం కురిపిస్తూ అడుగుడుగునా మంగళ హారతులతో రమేష్ రెడ్డి స్వాగతం పలికారు. చారాల గ్రామం పండుగ వాతవరణం నెలకొంది. అనంతరం గోకులం షెడ్లు (ఆవుల షెడ్లు) ప్రత్యేక పూజలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి ప్రారంభం చేశారు. ఆవులకు పళ్ళ, పలహారాలు తినిపించారు. చారాల ప్రజలు రమేష్ రెడ్డి వినతులు సమర్పించారు, రమేష్ రెడ్డి సానుకులంగా స్పందించి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమములో లీలామాధురి, చిన్నరెడ్డెమ్మ పసు వైద్యాధికారి పవన్ కుమార్ మరియు మండల నాయకులు ఆవుల రామచంద్ర గిరిరాజు బోయకొండ సుబ్బు బాబు నాయుడు విజయ భాస్కర్ రెడ్డి, పృధ్వి, మంజు మొదలగు నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజనాల బండలో ప్రత్యేక పూజలు



విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాల బండ లో తిరుపతి తిరుమల దేవస్థానం వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకుదర్శనమిచ్చారు రాజనాల బండ ఈవో భాను ప్రకాష్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు వైకుంఠ ద్వారం ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షాదీమహాల్‌కు భూమి పూజ

విశాలాంధ్ర-చౌడేపల్లి: చౌడేపల్లి మండలం కాగతి పంచాయతీ, మర్రిమాకుల పల్లి గ్రామం నందు ముస్లిం సోదరుల సౌక ర్యార్థం షాదీమహల్‌కు మండల అధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డి (చిట్టి) నాయకులు ప్రదీప్ రాజు భూమి పూజ చేశారు. అనంతరం రమేష్ రెడ్డి షాదీమహల్ కట్టడానికీ లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. ముస్లిం సోదరులకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాగతి పంచాయతీ నాయకులు, కార్యకర్తలు మరియు ముస్లిం సోదరులు రమేష్ రెడ్డి ఘజ మాలతో సత్కరించి స్వాగతం పలికారు. మసీద్ నందు ప్రత్యేక ప్రార్థనలు చేసారు. కార్యక్రమములో మండల నాయకులు, కార్యకర్తలు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

భూ రీ సర్వేలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

కత్తితో దాడి ఒకరి పరిస్థితి విషమం

విశాలాంధ్ర-పుంగనూరు: మండలంలోని ఏటువాకిలి పంచాయతీ ప్రసన్నయ్య గారి పల్లి గ్రామంలో మండల రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో భూ రీ సర్వే శు క్రవారం రోజున జరుగుతుండగా గ్రామంలోని చారాల శ్రీనివాసులు స్వాధీనంలోని 199-2 సర్వే గ్రూపులో ఉన్న భూమి బావి పరంబోకు భూమి అని గ్రామానికి చెందిన మోపూరి సుబ్రహ్మణ్యం రాజేంద్ర ఆనంద్ చంద్రశేఖర్ రాజు తాసిల్దార్ రాముకి ఫిర్యాదు చేయడంతో తాసిల్దార్ రాము, రికార్డులు పరిశీలించి పై భూమి బావి పరంబోకు అని నిర్ధారించి వెళ్లిపోవడం జరిగింది. దీనితో తాసిల్దార్ రాము వెళ్లిన వెంటనే గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో చారాల శ్రీనివాసులు శివ జగదీష్ గంగాధర్ ఈ వర్గం వారు ఫిర్యాదు చేసిన మోపురి సుబ్రహ్మణ్యం రాజేంద్ర ఆనంద్ చంద్రశేఖర్ రాజు పై దాడి చేసి తీవ్ర గాయాలు పాలు చేయడంతోపాటు ఓ పూరి సుబ్రహ్మణ్యంను చారాల శ్రీనివాసులు కత్తితో పొట్ట పై పొడవడంతో అక్కడికక్కడే పడిపోవడం జరిగింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు బంధువులు ఆయనను పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించుగా పరిస్థితి విషమించడంతో డాక్టర్ల సలహా మేరకు కర్ణాటక రాష్ట్రం కోలార్ మెడికల్ కాలేజీకు ఆయనని తరలించడం జరిగింది మిగతా నలుగురు తీవ్ర గాయాలతో ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దాడి చేసిన నలుగురిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టడం జరిగింది విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ శ్రీనివాసులు తెలిపారు.

వెంకటేశ్వరుని సేవలో బొజ్జల బృందమ్మ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం తొండమాన్ పురం గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారిని ఎమ్మెల్యే మాతృమూర్తి బొజ్జల బృందమ్మ శుక్రవారం దర్శించుకు న్నారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని టీడీపీ తిరుపతి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి రంగినేని చెంచయ్య నాయుడు తదితరులతో కలిసి ఈ ఆలయంలో వెంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఇక్కడకు వచ్చిన ఆమెకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆమెకు అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించారు. జేబు క్యాలెండర్ అవిష్కరణ తొండమాన్ పురంలో వెంకటేశ్వర స్వామి దర్శనానంతరం ఆలయం వెలుపల టీడీపీ నాయకులు కందాటి విశ్వేశ్వర్ రెడ్డి ముద్రించిన నూతన సంవత్సర జేబు క్యాలెండర్లను బొజ్జల బృందమ్మ అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతియేటా వైకుంఠ ఏకాదశి రోజున ఈ మహావిష్ణువు చిత్రపటంతో కూడిన జేబు క్యాలెండర్లను ముద్రించి భక్తులకు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. అనంతరం రెండు వేల మంది భక్తులకు ఈ క్యాలెండర్లను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి రంగినేని చెంచయ్య నాయుడు, విష్ణు కుమార్, కందాటి లక్ష్మీకాంతమ్మ, ఆలయ ఇన్ స్పెక్టర్ రవి కుమార్ రెడ్డి, ఆలయ అర్చకులు సంపత్ స్వామి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఫల సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-గూడూరు: ప్రగతి సేవా సంస్థ 5వ వార్షికోత్సవం సందర్భంగా జనవరి 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు "ప్రగతి వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తు న్నారు. ఈ కార్యక్రమాలలో భాగంగా కీర్తిశేషులు పొణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు పొణకా మల్లికార్జున రెడ్డి సంపూర్ణ సహకారంతో గూడూరు పట్టణంలోని బాలాజీ నగర్ లోని ప్రగతి ఆఫీస్ నందు నిరుపేదలైన 15 కుటుంబాలకు 18 రకాల పలసరుకులను సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి దాతగా వ్యవహరిస్తున్న పొణకా మల్లికార్జున్ రెడ్డి కుటుంబం సుభిక్షంగా ఉండాలని కోరారు. అలాగే ప్రగతి సేవా సంస్థ చేస్తున్న కార్యక్రమాలకు వెన్నుదన్నుగా ఉన్న దాతలందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈనెల 12వ తేదీ జరిగే వార్షికోత్సవంలో అందరూ పాల్గొనాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ జి.చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు టీచర్ మామదూరు రాధయ్య, కెఆర్ఎం, కుమార్ నాయుడు, గాయత్రి స్కూల్ కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, పయ్యావుల మురళి నాయుడు, రిటైర్డ్ ఎస్సై ప్రభాకర్, శ్యామ్, కోట వెంకటేశ్వర్లు, పిల్లెల శ్రీనివాసులు, రాఘవ, గోల్డ్ షాప్ మల్లికార్జున్, లలిత బ్రాండ్ వెంకటేశ్వర్లు, ఆక్వా రమేష్, డిష్ నాగరాజు, కృష్ణారెడ్డి, సంచి ముని ప్రసాద్, కోట శ్రీధర్, నాగేంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అధికారులు పని చేయాలి

మండల అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

విశాలాంధ్ర-పెద్దపంజాణి: పోతున్న ప్రభుత్వ ఆలోచన లకు అనుగుణంగా అధికా రులు పనిచేయాలని పలమనేరు శాసన సభ్యు లు అమరనాథరెడ్డి సూచిం చారు. పెద్ద పంజాణి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఆయన అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారి అధికారులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ, ఆర్డబ్ల్యూఎస్, ఉపాధి హామీ, ఉద్యాన శాఖ, గృహ నిర్మాణ శాఖ, ఇరిగేషన్, రెవెన్యూ మరియు పంచాయతీరాజ్, ఆరోగ్య శాఖ, వైద్య మరియు పశు వైద్య, విద్యాశాఖ అధికారులతో ఆయన క్షుణ్ణంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ లో ఉన్న భవనాలు, నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రణాళికలు, రెవిన్యూ సదస్సుల్లో అందిన అర్జీల ఆన్లైన్ అంశం, ప్రభుత్వ సబ్సిడీ పథకాలు, లబ్ధిదారులకు గుర్తింపు, పెండింగ్ పనులు మరియు బిల్లులు అదేవిధంగా సకాలంలో రైతులకు ట్రాన్సుఫార్మర్ల పంపిణి తదితర అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. అర్హులైన లబ్ధిదారులకు భవిష్యత్తులో ప్రతి పథకం పారదర్శ కంగా అందేలా అధికారులు చూడాలని ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా ప్రజాప్రతినిధులతో అధికారులు సమన్వయం చేసుకొని మండల అభివృద్ధికి దోహదపడాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీడీవో బాలాజీ, తహసీల్దార్ ఇన్నసాధన్, ఎంపీపీ రెడ్డప్ప, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధితోనే సమాజ అభివృద్ధి

పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి

విశాలాంధ్ర-పెద్దపంజాణి: మహిళలు ఆర్థికంగా ఎదిగి నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని పలమనేర్ శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. పెద్ద పంజాణి మండల కేంద్రం లో జరిగిన పలు కార్యక్ర మాలలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. తొలుత బసవరాజు కండిగ గ్రామంలో ఏర్పాటు చేసిన గోకులం షెడ్ ను ఆయన ప్రారంభించారు. పెద్ద పంజాని మండలం గోకులం షెడ్లు నిర్మాణంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవడం పై ఆయన అధికారులను రైతులను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఓ రైతును ఆయన సన్మానించారు. తదనంతరం మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద జరిగిన మెగా రుణమేళాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్నారు. మహిళలను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా కుటుంబ ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ఎన్నికలలో మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అంచెలంచెలుగా నెరవేరుస్తుందన్నారు. అదేవిధంగా ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారుచేసి రాష్ట్ర పురోభివృద్ధిలో ప్రజలందరినీ భాగస్వామ్యంలో చేయాలన్నదే సీఎం ఉద్దేశమని వివరించారు. తదనంతరం మండలంలోని 1053 మందికి గాను 18.83 కోట్ల రూపాయల చెక్కును ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ రెడ్డప్ప, టిడిపి నాయకులు ఆనంద్, చలపతి, మురహరి రెడ్డి, సుధాకర్ రెడ్డి, రోజా రెడ్డి, నాగిరెడ్డి, శ్రీరాములు, రామకృష్ణ, భాను ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొణకా దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రగతి సేవా సంస్థ సభ్యులు

విశాలాంధ్ర-గూడూరు: నూతన సంవత్సరం, సంక్రాంతి శుభా కాంక్షలు తెలియజేయడానికి ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ ప్రగతి సేవా సంస్థ కుటుంబ సభ్యులు ప్రముఖ పారిశ్రామికవేత్త పొణకా శివకుమార్ రెడ్డి దేవసేనమ్మ దంపతులను కలవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ గూడూరు మున్సిపల్ చైర్మన్ గా పొణకా దేవసేనమ్మ ఎనలేని సేవలు చేసి ఆ పదవికి వన్నెతెచ్చారని పేర్కొన్నారు. అలాగే పారిశ్రామికవేత్తగా గూడూరుకు తన సొంత నిధులతో ఎన్నో సేవా కార్యక్రమాలు పొణకాశివకుమార్ రెడ్డి చేశారని వారి ద్వారా మరెన్నో సేవలు పొంది గూడూరు ప్రాంతవాసులకు లబ్ధి చేకూరాలని కోరారు. ఈ సందర్భంగా పొణకా శివ కుమార్ రెడ్డి దేవసేనమ్మ మాట్లాడుతూ ఐదు వసంతాలు పూర్తి చేసుకోబోతున్న ప్రగతి సేవా సంస్థకు శుభాకాంక్షలు తెలియజేస్తూ గూడూరు పట్టణంలో స్వచ్ఛంద సేవా సంస్థగా అనతి కాలంలోనే అన్ని వర్గాల ప్రజలకు వివిధ రకాల సేవలు చేస్తున్న ప్రగతి సేవా సంస్థ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు

ఆర్ అండ్ బి డిప్యూటీ ఎస్ఈపై ఫిర్యాదు

విశాలాంధ్ర-చిత్తూరు: చిత్తూరు రోడ్లు భవనాల శాఖ డిప్యూటీ ఎస్ఈ పై మహిళా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరికి ఫిర్యాదు చేశారు. తనను మానసికంగా వేధిస్తూ విధులు నిర్వహణకు ఆటంకం కలిగిస్తూ, ఫైల్స్ తీసుకెళ్లినప్పుడు బూతులు తిట్టడం, ఫైల్స్ ను విసిరి వేస్తూ, మనోవేదనకు గురి చేస్తున్నారని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. పలుమార్లు కార్యాలయంలో కాంట్రాక్టర్లు ఎదుట తనపై దురుసుగా ప్రవర్తించారని, ఉద్దేశపూర్వకంగానే తన పట్ల చులకనగా చూస్తూ కార్యాలయ సిబ్బంది ఎదుట దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. కార్యాలయ సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా తన వద్దకు వచ్చిన వారిపై కూడా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నా వద్ద ఉన్న ఫైల్స్ ను ఉద్దేశపూర్వకంగానే దాచి ఆఫీస్ నుండి నేను ఇంటికి వెళ్ళిన తర్వాత ఇతర వ్యక్తులతో ఆ ఫైల్స్ ను అప్రూవ్ చేసుకుంటున్నారని, తన వద్ద ఉన్న ఫైల్స్ కూడా కొన్ని అదృశ్యమయ్యాయని, ఏదో ఒక సాకు పట్టుకుని ప్రతిరోజు పలుమార్లు తన చాంబర్‌కు పిలిపించి నాపై దురుసుగా ప్రవర్తించడంతోపాటు, ఫైల్స్‌ను విసిరి పారేయడం దుర్భాషలాడం పరిపాటికి మారిందని, ఇలాంటి వేధింపులతో విధులను తాను సక్రమంగా నిర్వర్తించలేక పోతున్నట్లు ఆ మహిళ అసిస్టెంట్ ఈఈ ఆవేదన వ్యక్తం చేసింది. గతంలో కూడా డిప్యూటీ ఎస్ ఈ పై అనేక ఫిర్యాదులు ఉన్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ కు వివరించారు. దీనిపై జాయింట్ కలెక్టర్ స్పందించి ఈ విషయాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

బోయకొండలో రాహుకాల అభిషేక పూజలు

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన బోయకొండ గంగమ్మ దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు బోయకొండకు తరలివచ్చారు దంపతులు అభిషేక పూజలో పాల్గొన్నారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకరణలు దర్శనమిచ్చారు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో ఏకాంబరం ఆదేశాలు మేరకు వచ్చిన భక్తులు అందరికి ఉచిత అన్నదానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గంగిరెడ్డి సుధాకర్ కృష్ణప్ప చంద్ర రాజన్న బాబు దాము ప్రసాద్ వేద పండితులు గోవర్ధన్ అర్చకులు వశిష్ట ఆలయ సిబ్బంది రామనాథం సూరి సుధాకర్ రెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ శ్రీ ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు

అలరించిన 'సుందరకాండ' హరికథా గానం

విశాలాంధ్ర-సత్యవేడు: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పెద్దఎత్తున భక్తులు రాకతో శ్రీసిటీలోని శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ధనుర్మాసంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం శుక్రవారం తెల్లవారు జామున భక్తులకు 'ఉత్తర ద్వార దర్శనం' ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీసిటీ శ్రీవాణి ఆధ్యాత్మిక సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ 'హరికథ దురంధర' డా. వై.వెంకటేశ్వర్లు భాగవతార్ నేతృత్వంలోని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారు లచే నిర్వహించిన సుందరకాండ హరికథ గానం అందరినీ అలరించింది. ఈ కథలో భక్తి, పట్టుదల, విశ్వాసంతో సిద్ధించే విజయం గురించిన అంశాలను హైలైట్ చేస్తూ, లంకలో సీతను కనుగొనడానికి హనుమంతుడు చేసిన సాహసోపేత ప్రయాణాన్ని అద్భుతంగా వివరించారు. శ్రోతలు మంత్రముగ్ధులై హరికథను ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో సంగీత విద్వాంసులు రెడ్డి శంకర్ (తబలా), మురళి (కీబోర్డ్), జి.శ్రీనివాసులు (శృతి), జయ చంద్ర (రిథమ్ పాడ్) పాల్గొన్నారు. కళాకారుల బృందానికి అభినందనలు తెలిపిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, వారిని ఘనంగా సత్కరించారు. వైకుంఠ ఏకాదశి పూజా కార్యక్రమాలలో పరిసర గ్రామాల ప్రజలు చురుగ్గా పాల్గొని విజయ వంతం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆలయాన్ని తరచూ సందర్శించి స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన పిలుపునిచ్చారు. శ్రీసిటీ ఉద్యోగులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు మరియు సూళూరుపేట నుంచి పెద్ద సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తులందరికీ తీర్థ, అన్నప్రసా దాలు అందజేశారు. వివిధ పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకోవడం పట్ల భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

శ్రీగాయత్రీలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని శ్రీగాయత్రి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు హరిదాసులు, రైతుల వేషధారణలతో అలరించారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు గాలిపటాల పోటీలు నిర్వహించారు. ఆటలు సాంస్కృతిక కార్యక్రమాలతో భోగి మంటలు, గొబ్బెమ్మలతో సంక్రాంతి వైభవాన్ని, శ్రీగాయత్రి హైస్కూల్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు కలిసి కన్నులపండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, అకడమిక్ డీన్ శ్రీహరి, ఉపాధ్యాయులు రఫీ, సోనియా, సుప్రియ, మస్తాన్బీ, సమీన్, యామిని, ధనశ్రీ, రజినీ, భవాని, హరిత, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుదిపట్లలో వైకుంఠ ఏకాదశి శోభ

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు టీడీపీ సీనియర్ నాయకులు బడి సుధాయాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. పుదిపట్లలోని శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం ఉదయం నుంచే పెద్దఎత్తున తరలివచ్చారు. ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకుని.. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తుల కోసం బడి సుధాయాదవ్, ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

శ్రీచైతన్య చిల్డ్రన్స్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి స్థానిక కృష్ణారెడ్డి శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమి పాఠశాలలో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు కనులపండు వగా జరిగాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. భోగిమంటలు సమక్షంలో తల్లిదండ్రులు భోగిపళ్లతో తమ పిల్లలను దీవించారు. తదుపరి సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ సంక్రాంతి సంబరాల విశిష్టతను సవివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమం విజయవంతంగా జరగేం దుకు ముఖ్య కారణమైన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ మరియు బోధనేతర సిబ్బందికి యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు. విద్యాధికురాలు, సంఘసేవ తత్పరురాలు లంకెళ్ళ లలిత, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి భక్తుల సేవలో పుత్తూరు స్కౌట్స్ అండ్ గైడ్స్

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు స్కౌట్స్ అండ్ గైడ్స్ డిస్ట్రిక్ ఆర్గనైజింగ్ కమిషనర్ ఏ.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నగిరి కరిమాణిక స్వామి టెంపుల్ కమిటీ జ్యోతి నాయుడు ఆహ్వానం మేరకు స్కౌట్స్ 15 మంది అలాగే పుత్తూరుకి సమీపమున తమిళ నాడు కొలతూర్ నందు శ్రీదేవి భూదేవి విజయ రాఘవస్వామి టెంపుల్ నందు 30 మంది గైడ్స్ విద్యార్థులు భక్తులకు విశిష్ట సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు గర్ల్స్ హై స్కూల్, ఎస్ఆర్ఎస్ గవర్నమెంట్ హై స్కూల్, గేట్ పుత్తూరు జడ్పీ హైస్కూల్, జెడ్పీ హైస్కూల్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు భక్తులకు విశిష్ట సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో లీడర్ జ్యోష్న, జయ, శైలజ, భూలోకేశ్వరి, రదియా, కవిత. రోవర్ లీడర్ జై కుమార్ సమీర్ గైడ్ కెప్టెన్ ఎం సునీత రెడ్డి రాణి నాగరత్నం స్కౌట్ మాస్టర్ జయదేవ్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి చేద్దాం

విశాలాంధ్ర-చంద్రగిరి: మండలాన్ని పార్టీలకతీతంగా అభివృద్ధి చేద్దామని ఇందుకు అధికారులు అంతా సహకరించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మండల ఎం.పి.డి.ఓ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి నాని ముఖ్య అతిథిగా హాజరైనారు. మండలంలోని నాయకులు, ప్రజా ప్రతినిధులు తెలిపిన సమస్యలను సానుకూలంగా విని ఆ సమస్యను త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. గత పది సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని చంద్రగిరి నియోజకవర్గం కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే అభివృద్ధిలో పరుగులు పెడుతున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు చెప్పిన సమస్యలను స్వయంగా రాసుకుని సమస్యను బట్టి మూడు నెలల నుండి ఆరు నెలల లోపు పరిష్కరిస్తానని తెలిపానన్నారు. గత పది సంవత్సరాలలో పంచాయతీలో పన్నులు వసూళ్లకే తప్ప అభివృద్ధికి నోచుకున్న పాపాన పోలేదని కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే పంచాయతీలలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో పంచాయతీలలో అభివృద్ధి ఆగ మేఘాలపై జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హరికిషన్‌కు పైనేని చిన్న బుచ్చినాయుడు స్మారక పురస్కారం

విశాలాంధ్ర-గంగవరం: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన స్మారక పురస్కారాలు అందించనున్నట్లు సంస్థ అధ్యక్షులు పి.తులసి నాథం నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. పైనేని చిన్న బుచ్చినాయుడు స్మారక పురస్కారాన్ని కర్నూలుకు చెందిన డా. హరికిషన్‌కు, శ్రీమతి శ్రీ వి.బసయ్య స్మారక పురస్కారాన్ని చిత్తూరుకు చెందిన గుమ్మడి జయరామ రెడ్డికి అందిస్తామన్నారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళామందిరంలో జరిగే కార్యక్రమంలో ఒక్కొక్కరికి రూ.5 వేల నగదుతో బాటు పురస్కారం అందిస్తామన్నారు.

సోక్రటీస్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-వెదురుకుప్పం: మండలంలోని దేవలంపేట సోక్రటీస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో భోగి మంటలు వేసి, పొంగళ్ళు పెట్టి, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన టీచర్లకు వెదురుకుప్పం సబ్ ఇన్స్పెక్టర్ వెంకట సుబ్బయ్య చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ గుణశేఖర్, చైర్మన్ అనిత ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

యూజీసీ మార్గదర్శలపై అభిప్రాయాలు వ్యక్తపరచిన అధ్యాపకులు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి పర్యటనకు విచ్చేసిన అఖిల భారతీయ రాష్ట్రీయ షేక్షిక్ మహాసంఘ్ న్యూఢిల్లీ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంట లక్ష్మన్న జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం అతిథి గృహంలో అధ్యాపకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల యూజీసీ విడుదల చేసిన మార్గదర్శాలపై పలు అభిప్రాయాలు వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టెక్నికల్ సెక్రటరీ ఎస్వీయూ అధ్యాపకుడు డాక్టర్ ఎన్.బాలసుబ్రమణ్యం, పాండిచ్చేరి యూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ చరణ్, ఎన్ఎసయు నుంచి డాక్టర్. బుల్లిదాస్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ చందులాల్, డాక్టర్ జేబీ చక్రవర్తి పాల్గొన్నారు.

ఉల్లాస కార్యక్రమంపై శిక్షణ

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండల కార్యాలయ సమావేశపు మందిరంలో వయోజన విద్య శాఖ,వెలుగు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉల్లాస కార్యక్రమం పై తిరుపతి జిల్లాలోని ఎపియంలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఆర్ డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.ఎన్. శోభన్ బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నిరక్షరాస్యు లను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది డిజిటల్ లిటరసీ, ఫైనాన్షియల్ లిటరసీ అవగాహన కల్పించి మన జిల్లాను ఆదర్శంగా ఉండే విధంగా అందరూ కృషి చేయాలని కోరారు. మండల అభివృద్ధి అధికారి రామచంద్ర మాట్లాడుతూ మహిళలు నగదు లావాదేవీలు చేయకుండా డిజిటల్ లావాదేవీలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య శాఖ అధికారి ప్రసాద్, డిఆర్‌డిఏ విజయ, చంద్రబాబు, వయోజన విద్యాశాఖ సూపర్వైజర్లు, ఏపీఎంలు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సుల తనిఖీలు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వచ్చే ప్రయాణికుల నుంచి అధిక చార్జీ వసూలు చేసినా, ప్రయాణ సమయంలో ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా శాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. వాహనాలకు సరి అయిన రికార్డులు లేకపోయినా నిబంధనలకు విరుద్ధంగా బస్సులు తిరుగుతున్నా జప్తు చేస్తామని స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా తిరుపతి జిల్లాలోని ఐదు కార్యాలయ అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలతో ఈ తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ తనిఖీలు 10రోజులు పాటు కొనసాగుతాయని తెలియజేశారు. వాణిజ్య పరమైన వస్తువులని బస్సులలో తరలించకూడదని ప్రాణుకుల్ని సురక్షితంగా గమ్యాలకి చేర్చాలని తెలియజేశారు. ముఖ్యంగా కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సుల డ్రైవర్లు మద్యం సేవించి వాహనాల్ని నడపరాదని, తనిఖీలలో పట్టుబడిన ఎడల తీవ్రమైన చర్యలు తీసుకొని న్యాయస్థానంలో ప్రాసిక్యూషన్ చేయడం జరుగుతుందని ప్రైవేట్ యాజమాన్యం సరైన పద్ధతిలో వాహన పద్ధతులను నిర్వహించాలని తెలియజేశారు.

వార్డు ఉద్యోగుల సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌తో చర్చ

విశాలాంధ్ర-పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గాను పలమనేరు ఏపీఎన్జీజీఓ సంఘం అధ్యక్షుడు ఆనందబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్‌ల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కమీషనర్ ను శుక్రవారం కలిసి చర్చించారు. ఈ సమావేశంలో పండుగ సెలవులలో సిబ్బందికి విధులు కేటాయించడం పైన, కార్యాలయ పని వేళలు పొడిగించిన అంశం పైన, సిబ్బందికి అర్హమైన సెలవుల మంజూరులో ఎదురవుతున్న ఇబ్బందులపైన ఉద్యోగ సంఘాల నాయకత్వం మున్సిపల్ కమీషనర్ ఎన్.వి.రమణా రెడ్డి తో చర్చించడం జరిగింది. కమీషనర్ అన్ని సమస్యలపై సానుకూలంగా స్పందించినట్లుగా మున్సిపల్ కార్యాలయం వెలుపల నిర్వహించిన ప్రెస్ మీట్ నందు సంఘ నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా గ్రామ వార్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రమణ, ఏపీ ఎన్జీజీఓ జాయింట్ సెక్రటరీ హైదర్, పలువురు వార్డు సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్స్‌కు వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

విశాలాంధ్ర-పుత్తూరు: నగరి నియోజకవర్గం సిపిఐ పార్టీ నాయకుడు ఏఐటియుసి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి టి కోదండయ్య ఆయన మాట్లాడుతూ ప్రకారం కూటమి ప్రభుత్వం జీతాలు పెంచాలని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ అనుబంధం చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ డిమాండ్ చేశారు. మంగళవారం చిత్తూరు కలెక్టర్ ఆఫీస్ దగ్గర జాతీయ సమితి పిలుపులో భాగంగా ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ అనుబంధం చిత్తూరు జిల్లా సమితి జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి ఆధ్వర్యంలో అంగన్వాడి సమస్యల పైన జిల్లా జాయింట్ కలెక్టర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కోదండయ్య. ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ అనుబంధం చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రేమ మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి కేంద్ర ప్రభుత్వం ఇప్పటిదాకా వేతనాలు పెంచలేదన్నారు. అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు మినీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య అంగన్ వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటియుసి అనుబంధం) జిల్లా కార్యదర్శి ప్రేమ జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి ఏఐటీయూసీ చిత్తూరు నగర కార్యదర్శి దాసరి చంద్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమాదేవి ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటియుసి అనుబంధం చిత్తూరు జిల్లా నాయకులు అరుణ రమాదేవి సుజాత జ్యోతి శాంతి రాధా తదితరులు పాల్గొన్నారు.

శ్రీ శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠనాథ స్వామి మహోత్సవం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కోలాహలంగా ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠనాథ స్వామి వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి, శ్రీకాళహస్తి అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్ నేతృత్వంలో తన స్వంత గ్రామైన కాట్రపల్లి నందు వైకుంఠ ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠనాథ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయపూర్వమే స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, విశేష పూజలు నిర్వహించిన అనంతరం నూతనోత్తేజంగా పుష్పాలంకరణతో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. తదుపరి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనాన్ని భక్తులు అధికసంఖ్యలో పాల్గొని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠనాథ స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. తదుపరి పురవీధుల్లో కోలాహలంగా కోలాటాలు, నృత్యాలు నడుమ ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ప్రజలకు దర్శన ఏర్పాట్లు చేయడమైనది. వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలుతో పాటు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, శ్రీకాళహస్తి అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్, "తేజోభారత్ వ్యవస్థాపకరాలు కోలా విశాలాక్షి", గ్రామపెద్దలు కోలా గోవర్ధన్, రాయదుర్గం నంద కుమార్, గవర్ల కృష్ణయ్య, అసెంబ్లీ పార్టీ కో-కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్. హరీష్ రెడ్డి, సజ్జా హరీష్, కోనేటి అయ్యప్ప, కటికం చెందు, గిరిధర్ సాయి, సూర బిందు కుమార్, గాలి రమేష్ నాయుడు, రాయదుర్గం చిరంజీవి, కోలా మురళీ, సిద్ధూ శ్రీనివాస్, కిషోర్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

నా తండ్రికి ఏదైనా జరుగుతే మున్సిపల్ అధికారులే కారణం

విశాలాంధ్ర-వెంకటగిరి: 9వ వార్డు కౌన్సిలర్ కందాటి కళ్యాణి తల్లిదండ్రులైన చిలుకూరు శివరామిరెడ్డి, సరస్వతమ్మలు పట్టణంలోని 9వ వార్డులో నివాసముంటున్నారు. మూడు రోజుల ముందు ఉపాధ్యాయ నగర్‌లో నివాసముంటున్న ఇల్లును ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా జెసిబి లతో కూలదోసిన సంఘటన కళ్ళ ముందు జరగడంతో ఆ ఆలోచనలో ఆయన అస్వస్థతకు గురవడంతో ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉంది. నా ఇంటికి ఉండాల్సిన పత్రాలతో పాటు ఇంటి పన్ను, కరెంటు మీటర్ ఉన్నా, మున్సిపల్ అధికారులు కుట్ర పూర్వకంగా ధ్వంసం చేయడంతో ఆ బాధను తట్టుకోలేక శుక్రవారం శివరామిరెడ్డి ఆరోగ్యం క్షీణించింది. మా ఇల్లు రోడ్డు మార్గానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉన్నా ఎందుకు జెసిబిలను ఏర్పాటు చేసి కూల్చారో ఇప్పటికీ తెలియటం లేదని, ప్రస్తుతం రేకుల కింద నివాసం ఉండాల్సిన పరిస్థితి మాకు ఏర్పడిందని బాధితురాలు సరస్వతమ్మ ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన అంబులెన్సులో తిరుపతికి పంపటం జరిగింది.

ఎమ్మెల్యే చే హాట్ స్పాట్ కేఫ్ క్రికెట్ స్టేడియం ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-గంగవరం: మండలంలోని వైయస్సార్ కూడలిలో హాట్ స్పాట్ కేఫ్ క్రికెట్ స్టేడియం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పలమనేరు శాసనసభ్యులు ఎన్. అమర్నాథ్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సరదాగా కొంతసేపు క్రికెట్ ఆడి యువతను ప్రోత్సహించారు. మానసిక, శారీరక ఉల్లాసానికి క్రీడలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పలమనేర్ ప్రాంతంలో ఇలాంటి స్టేడియం ఏర్పాటు కావడం ఆనందించదగ్గ విషయమన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, సోమశేఖర్ గౌడ్, ప్రతాపరెడ్డి, ప్రసాద్ నాయుడు,రాము రెడ్డి, గిరిధర్ గోపాల్, యుగంధర్ నాయుడులతో పాటు నాగరాజు రెడ్డి, నరేష్ రెడ్డి, గిరిబాబు, ఖాజా పీర్, చాంద్ బాషా, మదన్, శ్రీధర్, కిరణ్, బీఆర్సి కుమార్, జనసేన నాయకులు దిలీప్ కుమార్, నాగరాజు తదితరులున్నారు.

ఆక్స్‌ఫర్డ్ పబ్లిక్ స్కూల్ నందు ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధిలో ఉన్నటువంటి ఆక్స్‌ఫర్డ్ పబ్లిక్ స్కూల్ నందు ముందస్తు సంక్రాంతి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా భోగి మంటల సమక్షంలో భోగి పండ్లతో పిల్లలందరినీ స్కూల్ కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి ఆశీర్వదించారు. స్కూల్‌లో విద్యార్థులతో బోగిమంటలు, రంగ వల్లులు వేసి వేడుకలు జరుపుకున్నరు. ఈసందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ భవష్యత తరాల వారికి మన సాంప్రదాయాలు, కట్టుబాటులు, పండుగలు గుర్తుండేలా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతోపాటు స్కూలు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-సత్యవేడు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి జిల్లా సత్యవేడు వైద్య ఆరోగ్యశాఖ సబ్ యూనిట్ అధికారి మోహన్ చెప్పారు. మండల పరిధిలోని పుదుకుప్పం గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ నాగమణి అధ్యక్షతన దాసుకుప్పం పీహెచ్సీ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సబ్ యూనిట్ అధికారి మోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నందువల్ల సీజనల్ వ్యాధులు వస్తున్నాయన్నారు. ముఖ్యంగా విష జ్వరాలు, జలుబు, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధుల బారిన ప్రజలు పడే అవకాశం ఉందన్నారు. అయితే దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమలు పెరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. తదనంతరం సబ్ యూనిట్ అధికారి మోహన్ ఎంపిహెచ్ఓ సుబ్రమణ్య, ఆరోగ్య సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికి వెళ్లి నిరుపయోగంగా ఉన్న టైర్స్, ట్యూబ్, కుండీ, కొబ్బరి చిప్పలు వంటివి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ విస్తరణ అధికారి తరుణాక్ష రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ మాధవి, ఏఎన్ఎం సుమలత, ఎంఎల్ హెచ్‌పి మహాలక్ష్మి, పలువురు వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీరామ్‌నగర్ కాలనీలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నందు శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో భోగి మంటలతో పాటు పిల్లలకు ఆటపాటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి ఎస్.మహీర, రెండవ బహుమతి ఎం.హిమజ, మూడవ బహుమతి బి.హమీలలు గెలుపొందారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఢిల్లీబాబు, హెడ్‌మాస్టర్ డాక్టర్ జె.సుప్రజ, ఉపాధ్యాయులు జి.నాగేశ్వరి, టి.రేవతి, శ్రీధర్‌రెడ్డి, హైమావతి, బాలసుబ్రమణ్యం, ప్రశాంత్, పిల్లలు పాల్గొన్నారు.

శ్రీ మధ్వెంకట రామమూర్తి స్వామి ఆలయంలో ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు

విశాలాంధ్రు-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట లో వెలసి ఉన్న శ్రీ మధ్వెంకట రామమూర్తి స్వామి ఆలయం లో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా జరిపించారు, శ్రీ మధ్వెంకట రామమూర్తి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేసి ఆకర్షణీయంగా అలంకారాలు చేశారు, పెద్ద సంఖ్యలో భక్తులు తెల్లవారుజాము నుండి ఆలయం వద్ద బారులు తీరి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు, తీర్థప్రసాదాలు సేవించారు. ఉభయదాతలు కీ.శే. సురేష్ జైన్ జ్ఞాపకార్థం వారి కుమారులు శివదీప్ జైన్, హరి జైన్, రిషాన్ జైన్ కుటుంబ సభ్యులతో వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వినుకొండ అనంత కుమార్ దీక్షితులు నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల నిర్వహణకు బీరకా రాంబాబు, పిచ్చిక శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వర్లు, మాదరపాక సురేష్, శివశంకర నాపా మునిరాజా, కందం భగవాన్ దాస్ సహకారాన్ని అందజేశారు.

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు, పిసిసి అధ్యక్షుడికి ఘన స్వాగతం

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని తిరుమలకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కి, పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌడపేరు చిట్టిబాబు సాదర స్వాగతం పలికారు. శుక్రవారం శ్రీవారి దర్శనానంతరం వారికి తిరుపతిలోని ప్రముఖ ఆలయాలైన శ్రీ కపిలేశ్వర స్వామి వారి ఆలయం అలాగే తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి దర్శనాలను దగ్గరుండి చేయించారు. ఈ సందర్భంగా వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పగుచ్చం అందించి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఎస్సీ విభాగం మాజీ అధ్యక్షుడు చిత్తూరు శివశంకర్ కూడా పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-తొట్టంబేడు: శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్ రీసెర్చ్, టాటా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో తొట్టంబేడు మండలం రామచంద్రాపురంలో శుక్రవారం నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా స్థానికులకు ఉచితంగా బీపీ, షుగర్, స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. ఈ సమస్యలతో ఎవరైనా గ్రామీణ ప్రజలు బాధపడుతుంటే అలాంటి వారికి టాటా ట్రస్ట్ వారు తిరుపతి నగరంలోని అలిపిరి జూ పార్క్ కు దగ్గరలో ఉన్న "స్వీకార్ క్యాన్సర్ హాస్పిటల్" లో అతి తక్కువ ఫీజు తో ప్రముఖ వైద్యులచే వైద్య సేవలు అందజేస్తున్నామన్నారు. ఈ అవకాశం ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ రెడ్డి కుమారి, డాక్టర్ సాయిపూజ, డాక్టర్ వెంకయ్య బాబు, డాక్టర్ విన్నిత, పీహెచ్ఎన్ సంపూర్ణమ్మ, సూపర్ వైజరు ధనమ్మ, ఏఎన్ఎం సుధ, ఎంఎల్ హెచ్ పీ భారతి, డీఈవో మహేంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సముద్రంలో గల్లంతైన విద్యార్థులలో ఒకరి మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-వాకాడు: మండల పరిధిలోని తూపిలి పాలెం సముద్ర తీరంలో గురువారం కొంతమంది విద్యార్థులు సముద్ర స్నానం ఆచరించగా వారిలో ఇద్దరు విద్యార్థులు సముద్రంలోని అలలు ఉధృతకు కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్లను రంగంలోకి దింపినప్పటికీ విద్యార్థులు ఆచూకీ కానరాలేదు శుక్రవారం పోలీసులతో కలిసి విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల మృతదేహాల కోసం సముద్రతీరంలో గాలింపు చర్యలు చేపట్టగా శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో గల్లంతయిన ఇద్దరు విద్యార్థులలో ఒకరైన మామిడి లోకేష్ మృతదేహం అలల తాకిడికి ఒడ్డుకు కొట్టుకొని వచ్చింది మృతి దేహాన్ని చూసిన గ్రామస్తులు వారి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమై పోలీసుల సూచనల మేరకు బాలిరెడ్డిపాలెం ప్రభుత్వ వైద్యశాలకు పంచినామా నిమిత్తం తరలించారు.ఈ సంఘటనను విన్న వైట్ కుప్పం గ్రామస్తులు, విద్యార్థులు, అధ్యాపకులు కన్నీటి పర్యంతమయ్యారు.

బెల్ట్ షాపుల నిర్మూలన మహిళలు సాధించిన విజయం

విశాలాంధ్ర-పెళ్లకూరు: మండలం వైయస్సార్సీపి కార్యాలయము నందు జడ్పిటిసి ప్రిస్కిల్లా మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుచూ మద్యపానం విషయంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఊరికి ఎన్ని బెయిల్ షాపులు ఉన్నాయో స్థానిక ప్రజలకే అర్థం కావట్లేదు, నాణ్యమైన మందు తోపాటు, జన సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని షాపుల సంఖ్య ఉంటుందని ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు చేసిన కూటమి ప్రభుత్వం ఊరూరా ఉన్న ఈ బెల్ట్ షాపులను ప్రోత్సహించడం ఏమీ తెలియనట్లు స్థానిక నాయకుల నుండి రాష్ట్ర నాయకులు వరకు నటించడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. బెల్ట్ షాపుల విషయంలో మండల స్థాయిలో జిల్లా స్థాయిలో పలు వినతి పత్రాలు ఇచ్చేటప్పుడు ఫలితం లేకపోవడంతో, ఈ విషయమై రాష్ట్రంలో మొట్టమొదట వైయస్సార్సీపి పార్టీ మహిళలు హైకోర్టును ఆశ్రయించామని కోర్టు మా మహిళల సమస్యలను దృష్టిలో ఉంచుకొని తీర్పు అనుకూలంగా రావడం చాల సంతోషించదగిన విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కే కల్పన, అనిత, సుజాత, స్వప్న, శైలజ, కమలమ్మ, బాలాజమ్మ మొదలైన సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అలిపిరిలోని శ్రీవారి పాదాల మండపంలో వైకుంఠ ఏకాదశి

విశాలాంధ్ర–తిరుపతి : వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. తొలిత ఉదయం 3 గంటలకు భోగ శ్రీనివాసమూర్తిని తిరుప్పావైతో అర్చక స్వాములు మేల్కొలిపారు. అటు తర్వాత శుక్రవారం కావడంతో తిరుమల శ్రీవారి ఆలయ తరహాలోనే మూల విరాట్ కు, శ్రీవారి పాదాలకు, భోగ శ్రీనివాసమూర్తికి పాలు, పెరుగు, తేనె పంచామృతం తదితర సుగంధ ద్రవ్యాలతో అర్చక స్వాములు మురళీ, మురళీ కృష్ణ,ఏకాంతంగా అభిషేకం నిర్వహిం చారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో, స్వామివారిని పలురకాల ఆభరణాలతో, పుష్పమాలలతో అందంగా అలంకరిం చారు. అదేవిధంగా గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలను, అలంకరించారు. పట్టు వస్త్రాల సమర్పణ..గత 26 సంవత్సరాలుగా అలిపిరిలోని శ్రీవారి పాదాల మండపం లోని శ్రీవారికి, గోదాదేవి, లక్ష్మీనారాయణ స్వామి, పెరియాళ్ ,ఆంజనేయ స్వామి వారికి తిరుపతి సరోజినీ దేవి రోడ్డుకు చెందిన శ్రీవారి భక్త కుటుంబం వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఆ కుటుంబ సభ్యులతో పాటు తిరుపతికి చెందిన కాసరం హరీష్ దంపతులు, శిల్పం విద్యాసాగర్ తదితరులు ఈ వస్త్ర సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రత్యేక పుష్పాలంకరణలు టిటిడి ఉద్యానవన విభాగ మేనేజర్ జనార్దన్ రెడ్డి నేతృత్వంలో దేవస్థానం సిబ్బంది అలిపిరి శ్రీవారి పాదాల మండపం, లక్ష్మీనారాయణ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పుష్పాలతో విశేష అలంకరణలు చేశారు. ఈ పుష్పాలను టీటీడీ తో పాటు పుష్పాలను వస్త్రాల దాతలతో పాటు కాసరం హరీష్ ,శిల్పం విద్యాసాగర్ ఆదం దశరద రామిరెడ్డి, బెంగళూరుకు చెందిన శ్రీకాంత్ అందించారు. తిరుమలకు వెళ్లలేని భక్తులందరూ అలిపిరిలోని శ్రీవారి పాదాల మండపంలో వైకుంఠ ద్వారం ద్వారా శ్రీ వెంకటేశ్వర స్వామిని శ్రీవారిని శ్రీవారి పాదాలను దర్శించి పునీతులయ్యారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా టిటిడి సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు.



శ్రీ కళ్యాణ వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తజనం

భక్తులకు వైకుంఠ ఉత్తర ద్వారా దర్శనం

విశాలాంధ్ర – చంద్రగిరి: చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీ కళ్యాణ వెంకన్న ఆలయానికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు ఉదయం నుంచి పోటెత్తి బారులు తీరి దర్శనం చేసుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయాన్ని అన్ని హంగులతో విద్యుత్ దీపాలంకరణతో గతంలో ఎన్నడూ లేని విధంగా తీర్చిదిద్దింది. శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం ఉదయం నుంచే పెద్దఎత్తున తరలివచ్చారు. ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లను ఏర్పాటు చేసి తోపులాటలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. సిఐ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

తుమ్మలగుంట శ్రీ కళ్యాణ వెంకన్న ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం

పోటెత్తిన భక్త జనం – 70 వేల మందికి పైగా భక్తులు వైకుంఠ ద్వార ప్రవేశం

విశాలాంధ్ర –తిరుపతి రూరల్ : అదిగదిగో.. భూలోక వైకుంఠం..ఆ వైకుంఠంలో కొలువు దీరిన శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వైభవాన్ని వేలాది మంది భక్తులు దర్శించారు.. దేవదేవుడు కొలువు తీరిన తిరు మల కొండలకు ఆనుకుని భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న తుమ్మలగుంట క్షేత్రంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంబరాన్ని తాకాయి. వైకంఠ ఏకాదశి పర్వదినాన శ్రీహరిని దర్శిస్తే సకల శుభాలు కలుగుతాయని ప్రతీతి. తిరుమల వెళ్లి స్వామిని దర్శించలేని భక్తులందరూ తుమ్మల గుంట చేరుకుని స్వామి దర్శనం చేసుకుంటున్నారు. ఆ తరువాత వైకుంఠ ద్వార ప్రవేశం చేసి గోవింద నామస్మరణలతో భక్తితత్వం పెంచుకుంటున్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆయం వద్ద భక్తుల హృదయాలను హత్తుకునేలా భారీ సెట్టింగ్ లను ఏర్పాటు చేశారు. ఆలయంతో పాటు వైకుంఠ ద్వారాన్ని సుంగదభరిత పుష్పాలు, పరిమళ భరిత పత్రాలతో అలంకరించారు. ముందుగా బ్రహ్మోత్సవాలలో స్వామి వారు అధిరోహించే వాహనాలను దర్శించుకునే భక్తులు ఆపై సప్తద్వారాల గుండా ఆనంద నిలయం నీడలో ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆపై స్వామిని దర్శించుకుని వైకుంఠ ద్వార ప్రవేశం చేసి తమ కోరికలను స్వామికి నివేదించుకున్నారు. ప్రముఖులతో పాటుగా సాధారణ భక్తులు సైతం వైకుంఠ ద్వార దర్శనం చేసుకు న్నారు. ప్రతి ఏటా తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద జరిగే వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. తిరుమల తరహాలో ఆగమ శాస్త్రం ప్రకారం వైకుంఠ ద్వారానికి పూజలు చేసి ప్రారంభిం చారు.

ముక్కంటి సేవలో నందమూరి రామకృష్ణ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం నందమూరి రామకృష్ణ దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి తెలుగు దేశం పార్టీ నేతలు ఈయనకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితు లు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రంగినేని చెంచయ్య నాయుడు, గంగలపూడి హరి, పోలూరు శ్రీనివాసులురెడ్డి, అశ్వద్ధామ, ఆలయ తనిఖీదారు హరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణా డిప్యూటీ సీఎంను కలిసిన బొజ్జల

విశాలాంధ్ర – శ్రీకాళహస్తి: తెలంగాణా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కలిశారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసిన సందర్భంగా శుక్రవారం కలిసి ముచ్చటించారు. మాజీ మంత్రి స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క ప్రస్తావించారు.

దళితులపై వీఆర్వో దౌర్జన్యం

వీఆర్వో హరినాథ్‌ను సస్పెండ్ చేయాలి

– సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి

విశాలాంధ్ర – యర్రావారిపాళ్యం: మండలంలోని ఉదయ మాణిక్యం పంచాయతీ లో పనిచేస్తున్న విఆర్ఓ హరినాధను తక్షణమే సస్పెండ్ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం పంచాయతీ పరిధిలో ఎరుకులపల్లికి చెందిన వ్యవసాయ సాగు భూమి విషయమై సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సాగు భూముల పరిశీలన కార్యక్రమం జరిగింది. అనంతరం యర్రావారిపాళ్యం మండల తహసిల్దార్ గారికి వినతిపత్రం ఇచ్చి సమస్యలను వివరించడం జరిగింది .ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ ఉదయ మాణిక్యం గ్రామపంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 13/ 22 లో కృష్ణ సాగర్ చెరువు పోరంబోకు భూమి వందల ఎకరాలు ఉన్న కేవలం ఎరికల కులస్తులు మాదిగ కులస్తులు ఓసి కులస్తులు అందరూ కలిసి 72 ఎకరాల మేర వంద సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారు. ప్రతి ఎరుకుల కులస్తులు రెండు ఎకరాల లోపు భూమి మాత్రమే సాగు చేసుకుంటున్నట్లు అయితే గత నెల రోజులుగా వీఆర్వో హరినాథ్ అనే రెవెన్యూ అధికారి ఎరుకుల కులస్తుల సాగు చేసుకుంటున్న భూమిని దున్ననివ్వకుండా, దున్నుకోవడానికి ట్రాక్టర్లు వచ్చిన ట్రాక్టర్లను సీజ్ చేస్తామని బెదిరించడం దౌర్జన్యం చేయడం జరుగుతూ ఉన్నది. ఈ విషయం సిపిఐ దృష్టికి వచ్చిందని నేరుగా పరిశీలిస్తే వీఆర్వో దారుణాలకు అంతే లేకుండా ఉన్నదని ఆయన తీవ్రంగా మండిపడ్డారు .వ్యవసా యం చేసుకుంటున్న వ్యవసాయ పంటల కొరకు చిన్న సన్నకారు రైతులు సుమారు 25 బోర్లు వేసుకొని పంట చేసుకుంటున్నారని , నారుబోసుకున్న పంటకు సాగునీరు రానీకుండా మోటార్ల బంద్ చేసి తీవ్ర ఇబ్బందులకు విఆర్ఓ గురిచేయడం మంచిది కాదని హెచ్చరించారు . ఎరుకలపల్లి కాలనీకి చెందిన నాలుగు కుటుంబాలు ఓసీ అగ్రకుల పావుజాలం కలిగి ఏరుకుల మాదిగ కులస్తులను తక్కువ చేసి చూస్తూ, విఆర్ఓ ఓసి కులస్తులకు బంధువు అని విఆర్ఓ ని అడ్డం పెట్టుకొని అగ్రకులస్తులు వారిని బెదిరించడం దుబాయించడం జరుగుతుందని ఇది మంచిది కాదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ దళిత గిరిజన బడుగు బలహీన వర్గ పేదలకు రెవెన్యూ అధికారులు అండగా ఉండాల్సింది పోయి గిరిజన దళిత కులాలను కించ పరుస్తూ విఆర్ఓ హరినాథ్ మాట్లాడడం బెదిరిస్తున్నందున అతని పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విఆర్ఓ వృత్తి నీ అడ్డం పెట్టుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నందున అతన్ని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన పేదలు పాల్గోన్నారు. మండల నాయకులు దనాసి వెంకటరమణ, రమేష్ ,చంగల్ రాయులు ,పల్లి పాకు చంద్ర ,రమణయ్య ,మాదిగ విశ్వనాధ్, లలిత పాల్గొన్నారు.

యంబియులో ఘనంగా 32వ వార్షిక క్రీడోత్సవాలు

విశాలాంధ్ర – చంద్రగిరి: చంద్రగిరి మండలం ఎ. రంగంపేట, మోహన్ బాబు విశ్వవిద్యాలయం శ్రీ విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్ క్రీడా మైదానంలో శుక్రవారం ఘనంగా 32వ వార్షిక క్రీడా దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా మరియు ఉల్లాసంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ క్యాబినెట్ మంత్రి కొండా సురేఖ, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ముఖ్య అతిథిలుగా విచ్చేశారు. యంబియు కులపతి డాక్టర్ ఎం. మోహన్‌బాబు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు ఈలు కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ప్రార్థనతో, క్రీడా పతకావిష్కరణ, వందనంతో ప్రారంభమైన కార్యక్రమం విద్యార్థులచే ప్రదర్శింపబడిన కవాతు, కర్రసాము, ఫ్లాగ్ డ్రిల్ వంటి శక్తివంతమైన నైపుణ్యం ప్రదర్శనలు, జాతీయ సమైక్యత, దేశభక్తి అనే అంశంపై విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ప్రేక్షకుల హృదయాలను ఆకట్టుకుంది. క్రీడాల్లో రాణించిన విద్యార్థులకు ట్రోఫీలు, పతకాలు అందించి అభినందించారు. అతిథులు విద్యార్థుల మనోధైర్యాన్ని పెంపొందించేలా క్రీడా ప్రాముఖ్యతను గురించి స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేసి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రోవోస్ట్ నాగరాజ రామారావు, విసి కరుణా కరణ్, రిజిస్టర్ సారధి, డిఎఫ్ఎ రవిశేఖర్, శ్రీ విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్, డీన్స్, ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.